సాక్షి పల్నాడు

ఆదివారం । 20 । ఆగస్టు । 2023



వైభవంగా లక్ష్మీ పూజలు

తాడేపల్లిరూరల్: సీతానగరం విజయకీలాద్రిపై శనివారం శ్రీ లక్ష్మీపూజలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. త్రిదండి చిన్న జీయర్‌స్వామి అనుగ్రహ భాషణ చేశారు.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శనివారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.2, 200, గరిష్ట ధర రూ.4, 400, మోడల్ ధర రూ.3, 400 వరకు పలికింది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటి మట్టం శనివారం 520.70 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 859.80 అడుగుల వద్ద ఉంది.

న్యూస్‌రీల్

అమరేశ్వరాలయంలో రాహుకేతు పూజలు



అమరావతి: ప్రసిద్ధ శైవక్షేత్రమైన అమరావతి బాల చాముండికా సమేత అమరేశ్వరాలయంలో శనివారం నుంచి రాహు కేతు గ్రహ పూజలు శనివారం ప్రారంభించారు. ఉదయం అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ వేమూరి గోపినాథశర్మ మాట్లాడుతూ ప్రతిరోజు రాహుకాలంలో అభిషేకం, పూజలు చేయటానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు.

వెబ్‌సైట్‌లో బ్యాక్‌లాగ్ పోస్టుల ప్రావిజనల్ లిస్ట్

నెహ్రూనగర్: ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులకు సంబంధించి ప్రావిజనల్ లిస్ట్‌ను జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరచడం జరిగిందని ఎస్సీ వెల్ఫేర్ డీడీ మధుసూధన్‌రావు శనివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. జిల్లాలో ఖాళీగా ఉన్న 54 ఎస్సీ, ఎస్టీ బ్యాక్ లాగ్‌పోస్టులకు సంబంధించి మార్చి 25న నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగిందన్నారు. జిల్లా సెలక్షన్ కమిటీ ద్వారా స్క్రూటినీ ప్రక్రియ అనంతరం ప్రావిజనల్ లిస్ట్‌ను 19న https://www.gunturap.in/2023 వెబ్‌సైట్‌లో పొందుపరచడం జరిగిందన్నారు. స్వీపర్, పబ్లిక్ హెల్త్ వర్కర్, గ్యాంగ్ మజ్దూర్, హోల్ టైమ్ సర్వెంట్, కళాసీ, డ్రెయిన్ క్లీనర్ పోస్టులకు సంబంధించిన రిట్ పిటిషన్ హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నందున ఆ పోస్టుల భర్తీ ప్రక్రియ హైకోర్టు ఉత్తర్వులకు లోబడి ఉంటుందన్నారు. మిగిలిన అన్ని పోస్టులకు సంబంధించిన వెబ్‌సైట్‌లో తెలిపిన షెడ్యూల్ ప్రకారం భర్తీ ప్రక్రియ ఉంటుందన్నారు. అభ్యర్థుల ఎంపిక వారి విద్యార్హతలతో సాధించిన ప్రతిభ ఆధారంగా జరుగుతుందని ఎవరూ దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని తెలియజేశారు.

ఇరువురు ఎంఈఓలకు అదనపు బాధ్యతలు

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు పశ్చిమ, పెదకాకాని మండల విద్యాశాఖాధికారులు (ఎంఈఓ-1) పోస్టుల్లో ఇరువురు ఎంఈఓలకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ పాఠశాల విద్య ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు శనివారం ఉత్తర్వులు విడుదల చేశారు. గుంటూరు తూర్పు ఎంఈఓ-1గా ఉన్న వి.వెంకటేశ్వరరావును గుంటూరు పశ్చిమ-1, తాడికొండ ఎంఈఓ-1 టి.ఇందిరను పెదకాకాని ఎంఈఓ-1గా ఎఫ్‌ఏసీలుగా నియమించారు. సంబంధిత ఎంఈఓలు సెలవులో ఉన్న కారణంగా తాత్కాలిక ప్రాతిపదికన ఆయా పోస్టులను భర్తీ చేశారు.

మహా జాబ్‌మేళాకు పోటెత్తిన విద్యార్థులు



గుంటూరు ఎడ్యుకేషన్: కళాశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వ మహిళా కళాశాలలో ఏర్పాటు చేసిన మహా జాబ్‌మేళాకు డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. జిల్లాల వారీగా హాజరైన విద్యార్థులకు కళాశాల ప్రాంగణంలో రిజిస్ట్రేషన్ చేశారు. కళాశాల మెయిన్ బ్లాక్‌తో పాటు జేకేసీ, కెమిస్ట్రీ, హోం సైన్స్ బ్లాక్‌లలో కంపెనీల వారీగా ఇంటర్వ్యూలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కళాశాల విద్య కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. ఆయన వెంట కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్నకుమారి, కళాశాల విద్య ఏజీఓ డాక్టర్ తులసి మస్తానమ్మ, ఉన్నారు. 225 మంది విద్యార్థులు ఉద్యోగాలను సాధించారు.

నాసికి చెక్ పెట్టినారు

పకడ్బందీగా విత్తన చట్టం అమలు చేస్తున్న ప్రభుత్వం

- నర్సరీల్లో నాణ్యత లేని నారు విక్రయాలపై చర్యలు
- విత్తన కంపెనీ, లాట్ నంబర్ వంటి వివరాలతో కూడిన 12 నిబంధనలు పాటించాల్సిందే
- రైతుకు నష్టం కలగకుండా సర్కార్ పటిష్ట చర్యలు
- జిల్లాలో అన్ని అనుమతులు పొందిన నర్సరీలు 320
- నారు కొనుగోలు సమయంలో తప్పక రశీదు తీసుకోవాలంటున్న ఉద్యానశాఖ అధికారులు



ఆత్మకూరులోని ఓ నర్సరీలో మిర్చినారును పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన శాఖ అధికారి బీజే బెన్నీ

సాక్షి, నరసరావుపేట: పల్నాడు రైతన్నలు మిర్చి లాంటి ఉద్యానపంటలపై ఎక్కువగా ఆధారపడుతుంటారు. రైతులు ఎక్కువగా ప్రైవేట్ నర్సరీల నుంచి నారు తీసుకువచ్చి పంటసాగు చేస్తుంటారు. ఐతే ఈ నర్సరీలు నిబంధనల పాటించక నాసిరకం నారు విక్రయించి గతంలో పెదకూరపాడు, అమరావతి, దుర్గి, కారంపూడి, వెల్దుర్తి లాంటి చోట్ల వందలాది మంది రైతులు తీవ్రంగా నష్టపోయారు. వీటికి అడ్డుకట్ట వేయాలన్న ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విత్తన చట్టం, నర్సరీ యాక్ట్‌లను పకడ్బందీగా అమలుచేస్తోంది. నాణ్యతలేని నారు విక్రయిస్తే నర్సరీ నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు సమన్వయంతో వెళ్లి నర్సరీల్లో నకిలీ నారుకు అడ్డుకట్ట వేసేలా కీలక చర్యలు చేపట్టారు. తనిఖీల సమయాన విత్తనం, నారు పెంపకం తదితర విషయాలపై క్షేత్రస్థాయిలో ఆరా తీస్తారు.

12 అంశాలతో కూడిన నిబంధనలు అమలు...

ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో నర్సరీలపై మరింత ఫోకస్ పెరిగింది. నర్సరీ నిర్వహకులు విత్తన కంపెనీ, రకాలు, జీఓటీ, ఎక్కడ కొనుగోలు చేశారు, ఎప్పుడు చేశారు వంటి అన్ని రికార్డులు ప్రత్యేకంగా నిర్వహిస్తున్న రిజిస్టర్‌లో పొందుపర్చాలి. నర్సరీ బెడ్లపై ఖచ్చితంగా అందులో వేసిన విత్తనం ప్యాకెట్లు, ఎప్పుడు నాటారు, ఏ ఏ మందులు వాడారు వంటి వివరాలతో కూడిన బోర్డులు పొందుపర్చాలి. రైతుకు మొక్కలను విక్రయించే సమయంలో తప్పకు రశీదు అందజేయాలి. ఈ రశీదు ఆధారంగా సాగు చేసిన తర్వాత తేడా కనిపిస్తే అధికారులకు ఫిర్యాదు చేసే వెసులుబాటు ఉంటుంది. మొత్తం 12 రకాల అంశాలతో కూడిన నిబంధనలు పాటించాలి, ఐదు రకాల రిజిస్టర్‌లను ఎప్పటికప్పుడు నిర్వహించాల్సి ఉంటుంది.

జిల్లాలో 320 నర్సరీలు...

ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో మొత్తం 320 నర్సరీలకు అనుమతుల పొందారు. జిల్లాలో ఖరీఫ్‌లో మొత్తం 2.7 లక్షల హెక్టార్లలో సాగు లక్ష్యంగా నిర్ణయించగా అందులో 77,644 హెక్టార్లలో మిర్చి సాగు ఉంటుందని ఉద్యాన శాఖ అధికారులు అంచనాలు వేస్తున్నారు. ప్రస్తుత సీజన్‌లో మిరప నారుకు డిమాండ్ పెరిగింది. విత్తనం కొనుగోలులో ఏ చిన్న పొరపాటు జరిగినా నష్టం పూడ్చలేని స్థాయిలో ఉంటుంది. ఇతర వాణిజ్య, ఉద్యాన పంటలతో పోల్చితే నష్టతీవ్రత ఎక్కువే. ప్రధానంగా నారు కొనుగోలు సమయంలో ఏమాత్రం మోసపోయినా రైతు నట్టేట మునిగినట్టే. పైరు ఏపుగా పెరిగినట్టు కనిపించినా, దిగుబడి మాత్రం కొంప ముంచక తప్పదు. మిర్చితో పాటు టమాట, బెండ, వంకాయ తదితర పంటల నార్ల విషయంలో కూడా ఇదే పరిస్థితి ఉంది. ఈ నష్టం నుంచి రైతును గట్టెక్కించేందుకే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం 'విత్తన చట్టం' అమలుకు శ్రీకారం చుట్టింది.

నర్సరీలపై నిత్యం నిఘా ఉంచుతున్నాం...

రైతులు నాసిరకం నారుతో నష్టపోకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం విత్తన చట్టం, నర్సరీ యాక్టులను పకడ్బందీగా అమలుచేస్తోంది. అందులో భాగంగా వ్యవసాయశాఖ సమన్వయంతో నిరంతరం నర్సరీలపై నిఘా ఉంచుతున్నాం. వాటి రిజిస్ట్రేషన్ వివరాలు చూస్తున్నాం. రైతులు నారు కొనేసమయంలో తప్పక రశీదు పొందాలి. అందులో విత్తన కంపెనీ, లాట్ నెంబర్ ఉన్నాయో లేదో చెక్ చేసుకోవాలి. ఇవేవి లేకుంటే నష్టం జరిగినప్పుడు ప్రశ్నించే హక్కు కోల్పోతాం.

– బీజే బెన్నీ, పల్నాడు జిల్లా ఉద్యాన శాఖ అధికారి

విత్తన చట్టం ప్రకారం నర్సరీల నిర్వహణ...



విత్తన చట్టం ప్రకారమే నర్సరీలను నిర్వహిస్తున్నాం. నాణ్యమైన విత్తనాలతో నిబంధనల ప్రకారం నారు పెంచి రైతులకు విక్రయిస్తున్నాం. రైతులు నారు కొనుగోలు చేసే సమయంలో తప్పకుండా రశీదు అందజేస్తున్నాం. నర్సరీ నిర్వహణకు ఉద్యానశాఖ నుంచి అనుమతులు పొందాం. రైతులకు విత్తన రకం, లేబుల్ కనిపించేలా బోర్డులను ఏర్పాటు చేస్తున్నాం.

– జాస్తి రామూర్తి, ముటుకూరు, దుర్గి మండలం

నాణ్యమైన నారు లభిస్తోంది...



నేను ఏడు ఎకరాల్లో మిర్చి పంట సాగు చేస్తాను. గతంలో విత్తన చట్టం అమల్లో లేకపోవడంతో నాసిరకం నారు కొనుగోలు చేసి తీవ్రంగా నష్టపోయాం. ప్రస్తుతం ప్రభుత్వ చర్యలతో రశీదుతో కూడిన నాణ్యమైన నారును నర్సరీ నిర్వాహకులు అందజేస్తున్నారు. విత్తనం ఏ రకం, ఎప్పుడు వేశారు వంటి వివరాలు తెలుసుకొనే వెసులుబాటు లభిస్తోంది.

– పగడాల కృష్ణయ్య, మిర్చి రైతు, దుర్గి

అభివృద్ధికి దక్కిన రి'వార్డు'



బి.పెదసోమయ్య (బొమ్మరాజుపల్లి 1వ వార్డు)



పొర్ల నరసింహారావు (బొమ్మరాజుపల్లి 7వ వార్డు)



షేక్ మీరాబీ (పిల్లుట్ల 9వ వార్డు)



షేక్ సైదాబీ (హసనాబాద్ 3వ వార్డు)



జూపల్లి మోషే (గుండ్లపల్లి 5వ వార్డు)



బత్తుల విజయలక్ష్మి (మూసాపురం 8వ వార్డు)



గాదె కొండారెడ్డి (విప్పర్లపల్లి, 1వవార్డు)



కంభంపాటి జైల్‌సింగ్ (ధరణికోట 11 వార్డు)

- పంచాయతీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతుదారుల ప్రభంజనం
- 2 సర్పంచ్ స్థానాలు కైవసం
- వార్డుల్లోనూ కొనసాగిన హవా

వైఎస్సార్ సీపీ మద్దతుతో ఏకగ్రీవమైన సర్పంచులు : 2

నరసరావుపేట: జిల్లాలో ఎనిమిది మండలాల పరిధిలోని 12 పంచాయతీల్లో గల 14 వార్డులకు శనివారం జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతుదారులు ప్రభంజనం సృష్టించారు. పార్టీలకు అతీతంగా ఎన్నికలు నిర్వహించినా గెలుపొందిన వారిలో అత్యధికులు వైఎస్సార్ సీపీ మద్దతుదారులే కావటం విశేషం. జిల్లాలో రెండు పంచాయతీలు, 48 వార్డులకు ఎన్నికల నోటిఫికేషన్ వెలువడగా నామినేషన్ల ప్రక్రియ ముగిసేనాటికి రెండు పంచాయతీలు, 33వార్డులు ఏకగ్రీవమయ్యాయి. వీటిలో రెండు పంచాయతీలు వైఎస్సార్ సీపీ మద్దతుదారులే కైవసం చేసుకోగా, ఒక వార్డుకు అభ్యర్థులే లేకపోవటంతో ఎన్నిక జరగలేదు. మిగిలిన 14 వార్డులకు నిర్వహించిన ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపర్చిన అభ్యర్థులు ఎనిమిది మంది, టీడీపీ బలపర్చిన అభ్యర్థులు ఆరుగురు గెలుపొందారు. కాగా, జిల్లాలోని 14 వార్డులకు శనివారం ప్రశాంతంగా ఎన్నికలు పూర్తిచేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి భాస్కరరెడ్డి పేర్కొన్నారు. గెలుపొందిన వారికి సర్టిఫికెట్లను అందజేశామన్నారు. అమరావతి మండలంలోని ఎండ్రాయ పంచాయతీలోని రెండోవార్డుకు యడ్ల శ్రీనాథ్, ధరణికోట పంచాయతీలోని11వ వార్డుకు కంభంపాటి జైల్‌సింగ్, అచ్చంపేట మండలం చెరుకుపాలెం పంచాయతీలోని పదో వార్డుకు సుంకర బుజ్జిబాబు, కొండూరులోని పదో వార్డుకు గాదే చిన గంగమ్మ, 11వ వార్డుకు పిల్లకతువుల చినవెంకయ్య, మాదిపాడులోని 4వ వార్డుకు షేక్ నాగూల్ బీ, ఈపూరు మండలంలోని ఉప్పరపాలెం పంచాయతీలోని 8వ వార్డుకు మేకల లక్ష్మయ్య, బొమ్మరాజుపల్లి 1వ వార్డుకు బోయినబోయిన పెదసోమయ్య, 7వ వార్డుకు పొర్ల నరసింహారావు, క్రోసూరు మండలం హసనాబాద్ పంచాయతీలోని 3వ వార్డుకు షేక్ క్రోసూరు సైదా బీ, మాచవరం మండలం పిల్లుట్ల పంచాయతీలోని 9వ వార్డుకు మీరాబీ ముజావర్, నకరికల్లు మండలం గుండ్లపల్లి పంచాయతీలోని 5వ వార్డుకు జూపల్లి మోషే, పెదకూరపాడు మండలం మూసాపురం పంచాయతీలోని 8వ వార్డుకు బత్తుల విజయలక్ష్మి, రొంపిచర్ల మండలం విప్పర్లపల్లి పంచాయతీలోని 1వ వార్డులో గాదే కొండారెడ్డి విజయం సాధించారన్నారు.

బడుగు, బలహీనవర్గాలకు అగ్రపీఠం

- 22న సత్తెనపల్లిలో జరిగే బీసీ గర్జనను విజయవంతం చేసి ఆశీర్వదించండి
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు





సభా స్థలిని పరిశీలిస్తున్న మంత్రి అంబటి, సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ లావు

సత్తెనపల్లి: బడుగు, బలహీన వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాట నిలబెట్టుకుంటున్నారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. సత్తెనపల్లిలో ఈ నెల 22వ తేదీన నియోజకవర్గస్థాయిలో నిర్వహించే బీసీ గర్జనను విజయవంతం చేయాలని కోరుతూ పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో శనివారం వడ్డెర సంఘ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ పార్టీ, ప్రభుత్వం, నామినేటెడ్ పదవుల భర్తీలో బీసీలకు పెద్దపీట వేస్తున్నారన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా బీసీలకు రాష్ట్రప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. సత్తెనపల్లి నియోజకవర్గంలో నిమ్మకాయల రాజనారాయణకు ఆసియా ఖండంలోనే అతిపెద్దదైన గుంటూరు మిర్చియార్డు చైర్మన్‌గా, సత్తెనపల్లి మండలం అబ్బూరు గ్రామానికి చెందిన యనమాల నాగార్జున యాదవ్‌కు రాష్ట్ర ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా రాష్ట్రస్థాయి పదవులు ఇచ్చి బీసీ వర్గాలకు ప్రాముఖ్యతను పెంచిందన్నారు. ఆ భరోసాను ఆదరిస్తూ సత్తెనపల్లి నియోజకవర్గంలో ప్రభుత్వానికి, తనకు అండగా ఉండాలని ఆయన కోరారు. ఈనెల 22వ తేదీన సత్తెనపల్లిలో కనీవినీ ఎరుగని రీతిలో బీసీల గర్జన నిర్వహిస్తున్నామని, ఆ సభకు అశేష సంఖ్యలో పాల్గొని బీసీలకు అండగా నిలిచిన ఈ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. బీసీ గర్జనలో నిమ్మకాయల రాజనారాయణకు, యనమాల నాగార్జున యాదవ్‌లకు ఘనంగా జరిగే సన్మాన కార్యక్రమ విజయవంతానికి వడ్డెర సామాజికవర్గం వ్యక్తిగతంగా శ్రద్ధ తీసుకోవాలని ఆయన నాయకులను కోరారు. నరసరావుపేట పార్లమెంటు సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీల రాజ్యాధికారానికి బాటలు వేశారన్నారు. సత్తెనపల్లి నియోజకవర్గంలో గతంలో జరిగిన వడ్డెర సత్తెన్న విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని సమష్టిగా విజయవంతం చేశారని, మరొక్కసారి బలహీనవర్గాలందరూ బీసీ గర్జన సభకు హాజరై విజయవంతం చేయాలని ఆయన నాయకులను కోరారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు, గుంటూరు కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ తాడిశెట్టి మురళి, నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు, తదితరులు మాట్లాడారు. అనంతరం నాయకులతో కలిసి మంత్రి అంబటి రాంబాబు బీసీ గర్జన జరిగే సభాస్థలిని పరిశీలన చేశారు. సమావేశంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు షేక్ నాగూర్ మీరాన్, రమావత్ కోటేశ్వరరావు నాయక్, నాయకులు పురుషోత్తమరావు, నల్లబోతు శివన్నారాయణ, అచ్యుత శివప్రసాద్, చిలక జైపాల్, తన్నీరు శ్రీనివాసరావు, వేముల వరప్రసాదరావు, వీరాంజ నేయులు తదితరులు ఉన్నారు.

అత్యాధునిక హంగులతో రిటైరింగ్ గదులు

ప్రారంభించిన డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ



మాట్లాడుతున్న డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ

లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే ప్రయాణికుల సౌకర్యార్థం రీ డెవలప్ మెంట్ కోసం రైల్వే శాఖ టూరిజం కార్పొరేషన్ రిటైరింగ్ గదులను ఏర్పాటు చేయడం ఆనందదాయకమని గుంటూరు డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ అన్నారు. స్థానిక గుంటూరు తూర్పు విభాగం రైల్వే స్టేషన్‌లోని మొదటి అంతస్తులో ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన విశ్రాంత గదులను డిఆర్‌ఎం ఎం.రామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రిటైరింగ్ గదులను ఐఆర్‌సీటీసీ స్వాధీనం చేసుకున్న తర్వాత అన్ని గదులు, డార్మిటరీలు పూర్తిగా ఎయిర్ కండీషనర్‌గా మార్చిందన్నారు. ఇది రైల్వే ప్రయాణికులకు ఆహ్లాదకరమైన అనుభూతిని ఇస్తుందన్నారు. ఈ గదులు టారిఫ్‌ను గుంటూరు రైల్వే స్టేషన్ సమీపంలోని హోటళ్ళతో పోల్చి సక్రమంగా నిర్ణయించామన్నారు. ఈ విశ్రాంత గదులు ప్రధానంగా రెండు సూపర్ డీలక్స్, 12 ఏసీ ఎగ్జిక్యూటివ్ గదులు, రిటైరింగ్ రూమ్‌లతో పాటు 11 డార్మిటరీ బెడ్ గదులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇందులో 9 సింగిల్ బెడ్‌లు, 1 డబుల్ డార్మిటరీ బెడ్‌లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ముదస్తుగా రిటైరింగ్ గదుల బుకింగ్‌లో పారదర్శకతను తీసుకురావడానికి, మొత్తం బుకింగ్ సిస్టమ్ ఐఆర్‌సీటీసీ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్ మోడ్‌లోకి తీసుకువచ్చామన్నారు. ఇందులో ప్రయాణీకులు సులభంగా లాగినై టిక్కెట్ల ఆధారంగా వారి రిటైరింగ్ రూమ్‌లను ముందుగానే బుక్ చేసుకుంటారని చెప్పారు. గుంటూరుకు లేదా గుంటూరుకు వెళ్లే సమయంలో సరైన రిజర్వేషన్ ఉన్న వారు మాత్రమే గదులను బుక్ చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే అధికారులు డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.కమలాకరబాబు, అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ టి.హెచ్.ప్రసాదరావు, అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ శైలేష్‌కుమార్, ఐఆర్‌సీటీసీ అధికారి కిషోర్ కుమార్, సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఐఆర్‌సీటీసీ వై.వి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అగ్నివీర్ రిక్రూట్‌మెంట్

ఏర్పాట్లను పర్యవేక్షించిన జిల్లా ఉన్నతాధికారులు



అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ నిర్వహించనున్న సత్తెనపల్లి రోడ్డులోని డీఎస్‌ఏ స్టేడియం

నరసరావుపేట: భారత సైన్యానికి సేవలు అందజేసేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన అగ్నివీర్ నియామకాలకు నరసరావుపేటలో ఏర్పాట్లు పూర్తి చేశారు. సత్తెనపల్లిరోడ్డులోని డీఎస్‌ఏ స్టేడియంలో గుంటూరు ఆర్మీ రిక్రూట్‌మెంట్ కార్యాలయం ఆధ్వర్యంలో అగ్నివీర్ ఎంపికలు ఈనెల 20వ తేదీ ఆదివారం నుంచి 26వ తేదీవరకు జరగనున్నాయి. ఇప్పటికే రాష్ట్రంలోని 13 నూతన జిల్లాలకు చెందిన ఔత్సాహిక అభ్యర్థులకు రాత పరీక్షలు నిర్వహించారు. సైన్యంలో వారందరి నియామకాలు చేయనున్నారు. గత కొన్నిరోజుల నుంచి జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి, జేసీ ఎ.శ్యామ్‌ప్రసాదు ఏర్పాట్లను పర్యవేక్షించారు. అభ్యర్థులు, అధికారులకోసం పల్నాడురోడ్డులోని ఎస్‌ఎస్‌ఎన్ కళాశాలలో వసతి ఏర్పాట్లను చేశారు.

ర్యాగింగ్‌కు దూరంగా ఉండండి

న్యాయమూర్తి జి.వాణి



ర్యాగింగ్‌పై అవగాహన కల్పిస్తున్న అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి జి.వాణి

బాపట్ల: ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి జి.వాణి పేర్కొన్నారు. బాపట్ల కాలేజీ ఆఫ్ ఫార్మసీ కళాశాల్లో ర్యాగింగ్‌పై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ర్యాగింగ్‌పై జడ్జి జి.వాణి మాట్లాడుతూ నేరానికి పాల్పడే వారిపై తగిన చర్యలు ఉంటాయని చెప్పారు. ర్యాగింగ్‌కు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు లీలా కృష్ణ, డాక్టరు సందీప్, రామారావు, అసోసియేషన్ అధ్యక్షులు ముప్పలనేని శ్రీనివాసరావు, ఎం.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉద్యోగాల పేరిట మోసం చేసిన వ్యక్తి అరెస్ట్

చీరాల: ఎస్సీ నిరుద్యోగ యువతను బ్యాక్‌లాగ్ పోస్టులు ఇప్పిస్తామని నమ్మించి లక్షల రూపాయలు వసూలు చేసిన వ్యక్తిని శనివారం చీరాల రూరల్ ఈపూరుపాలెం పోలీసులు అరెస్ట్ చేశారు. చీరాల రూరల్ సీఐ మల్లికార్జున రావు తెలిపిన వివరాలు.. పట్టణంలోని ఆనందపేటకు చెందిన యాతం క్రాంతి, ఎస్సీ నిరుద్యోగ యువతకు బ్యాక్‌లాగ్ పోస్టులు ఇప్పిస్తామని చెప్పి మోసం చేశాడన్నారు. ఉద్యోగాల పేరిట మరికొందరి వద్ద నుంచి లక్షల రూపాయలు వసూలు చేయగా చీరాల రూరల్ మండలం వాడరేవుకు చెందిన రూబెన్ కుమారుడికి బ్యాక్‌లాగ్ పోస్టు ఇప్పిస్తానని చెప్పడంతో అతడు రూ.4.50 లక్షలు విడతల వారీగా ఇచ్చినట్లు చెప్పారు. రోజులు గడుస్తున్నా ఉద్యోగం రాకపోయేసరికి మోసపోయామని గ్రహించి ఒత్తిడి చేయడంతో ఫోర్జరీ అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చి మోసం చేశాడన్నారు. దీంతో తనను ఉద్యోగాల పేరిట మోసం చేశాడంటూ ఈపూరుపాలెం రూరల్ పోలీసులకు, జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు అనంతరం యాతం క్రాంతిని శనివారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా 15 రోజులు రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

చేపలు పట్టేందుకు వెళ్లాడు.. శవమై వచ్చాడు

కారంచేడు: చేపలు పట్టుకోవడం కోసం కొమ్మమూరు కాలువ వద్దకు వెళ్లిన యువకుడు శవమై తేలిన ఘటన శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. చీరాల కొత్తపాలెం యానాది కాలనీకి చెందిన బాలసుబ్రహ్మణ్యం(19) స్నేహితులతో కలసి మండలంలోని స్వర్ణ గ్రామ సమీపంలోని కొమ్మమూరు కాలువ వద్దకు వెళ్లాడు. కొద్దిసేపు చేపలు పట్టిన తరువాత కాలువలో ఈత కొట్టేందుకు దిగాడు. ఈత కొడుతుండగా కొన్ని పశువులు కాలువలోకి రావడాన్ని గమనించాడు. బాలసుబ్రహ్మణ్యం అటువైపు కట్ట మీదకు వెళ్లేందుకు అటువైపు వెళ్తుండగా ఉధృతంగా ప్రవహిస్తున్న నీటి వేగానికి ముందుకు కొట్టుకుపోయాడు. అక్కడే ఉన్న తన స్నేహితులు, గ్రామస్తులు గాలింపు చర్యలు చేపట్టారు. కొద్ది సేపటికే శవంగా మారాడు. స్నేహితుడి మృతదేహాన్ని బయటకు తీశారు. విషయం తెలిసిన కారంచేడు ఎస్‌ఐ శ్రీనివాసరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడు అవివాహితుడు.

లింగ నిర్ధారణ చట్టం సమర్థంగా అమలు చేద్దాం

- డీఎంహెచ్‌వో డాక్టర్ శోభారాణి
- జిల్లా అడ్వయిజరీ బోర్డు కమిటీ సమావేశం


మాట్లాడుతున్న డాక్టర్ శోభారాణి

నరసరావుపేట: జిల్లాలో లింగ నిర్ధారణ చట్టం 1994ను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జి.శోభారాణి వెల్లడించారు. శనివారం పల్నాడు రోడ్డులోని డీఎండీహెచ్‌వో కార్యాలయంలో జిల్లా అడ్వయిజరీ బోర్డు కమిటీ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ చట్టం పరిధిని ఎవరైనా అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమన్నారు. లింగ నిర్ధారణ చేసినట్లు తెలియ వచ్చినప్పుడు చట్ట పరిధిలో శిక్షార్హులవుతారని హెచ్చరించారు. జిల్లాలో ఇప్పటివరకు 151 ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రులు లింగ నిర్ధారణ చట్టం పరిధి కింద అనుమతులు ఇవ్వబడ్డాయన్నారు. వీరందరూ కూడా చట్టం ప్రకారం అన్ని రికార్డులు నిర్వహించాల్సి ఉందన్నారు. జిల్లాలో నూతనంగా రెండు స్కాన్ సెంటర్లు, మార్పుల కోసం ఏడు చట్టం కింద నమోదు చేసుకున్నారన్నారు. వీటన్నింటిని తనిఖీలు నిర్వహించి నివేదిక జిల్లా కలెక్టర్‌కు సమర్పించి అనుమతులు మంజూరు చేస్తామన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులైన రెడ్‌క్రాస్ సొసైటీ డాక్టర్ ఎం.వసంత కిరణ్, నోడల్ అధికారి డాక్టర్ బి.గీతాంజలి, జిల్లా ప్రభుత్వ వైద్యశాలల పర్యవేక్షణాధికారి డాక్టర్ బీవీ.రంగారావు, డాక్టర్ జి.గిరిరాజు, డాక్టర్ కె.హనుమకుమార్, డాక్టర్ ఏ.శోభారాణి, డి.శివకుమారి, జి.సాంబశివరావు, షేక్ ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.

నిద్రిస్తున్న భర్తను హత్య చేసిన భార్య, ప్రియుడు

- మృతుడి శరీరంపై గాయాలు
- మృతుడి భార్యని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- పరారీలో ప్రియుడు


వెంకటేశ్వర్లు మృతదేహం

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోని 2వ వార్డు రంగా కాలనీలో దారుణం చోటు చేసుకుంది. కట్టుకున్న భర్తను ప్రియుడితో కలసి హతమార్చిన సంఘటన శనివారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని 2వ వార్డు రంగా కాలనీకి చెందిన ఎబ్బిలి వెంకటేశ్వర్లు (32) పట్టణంలోని ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో, స్థానికంగా ముఠా కార్మికుడిగా పనిచేస్తుంటాడు. అతనికి పదేళ్ల కిందట పిట్టలవానిపాలెం మండలం సంగుపాలెం కోడూరుకు చెందిన గౌరీతో వివాహమైంది. వీరికి ఇరువురు కుమారులు ఉన్నారు. అన్యోన్యంగా వీరి దాంపత్య జీవితం సాగుతుంది. ఈ క్రమంలో గౌరీ అదే వార్డుకు చెందిన కారు డ్రైవర్ పల్లపు సుబ్రహ్మణ్యంతో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ విషయం బయటకు తెలియడంతో రెండుసార్లు పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీలు జరిగాయి. కానీ వాటిని ఖాతరు చేయకుండా వారిరువురు యథావిధిగా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నారు. వెంకటేశ్వర్లు శుక్రవారం పనులకు వెళ్లి వచ్చి రాత్రి సమయంలో మద్యం తాగి ఇంట్లో నిద్రించాడు. భర్తను హతమార్చేందుకు అప్పటికే పథకం రచించుకున్న భార్య గౌరీ, ప్రియుడు సుబ్రహ్మణ్యంతో కలిసి నిద్రిస్తున్న వెంకటేశ్వర్లు గొంతు నులిమి హతమార్చారు. శుక్రవారం రాత్రి సాధారణంగానే నిద్రించిన వెంకటేశ్వర్లు తెల్లవారే సరికి విగతజీవిగా పడి ఉండటం, మృతుడి గొంతు, శరీరంపై గాయాలు ఉండటంతో భార్య గౌరీపై అనుమానం పెరిగింది. మృతదేహాన్ని చూసిన తల్లిదండ్రులు తమ కుమారుడు వెంకటేశ్వర్లుది సహజ మరణం కాదని అనుమానం వ్యక్తం చేశారు. ఈలోగా సమాచారం అందుకున్న పట్టణ సీఐ యు.శోభన్‌బాబు, ఎస్‌ఐ ఏ.రఘుపతిరావు, సిబ్బంది శనివారం ఉదయం సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి శరీరంపై గాయాలు, గొంతు నులిమినట్లు ఆనవాళ్లు కనిపించడంతో హత్యగా భావించి గౌరీని అదుపులోకి తీసుకొని విచారించారు.

విషయం తెలుసుకున్న ప్రియుడు పల్లపు సుబ్రహ్మణ్యం పరారయ్యాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు పోలీసులు తరలించారు. మృతుడి తండ్రి పెదగాలయ్య ఫిర్యాదు మేరకు హత్యా కేసు నమోదు చేశారు.

ఇరువురికి వీఐటీ అమరావతి క్యాంపస్‌లో ఉచిత విద్య



సత్తెనపల్లి: పల్నాడు జిల్లాకు చెందిన ఇరువురు విద్యార్థులకు వీఐటీ అమరావతి క్యాంపస్‌లో ఉచిత విద్య అభ్యసించేందుకు అవకాశం లభించింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యనభ్యసించిన విద్యార్థుల్లో జిల్లాస్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన ఇరువురు విద్యార్థులను ఎంపిక చేశారు. రాష్ట్ర స్థాయిలో 52 మంది విద్యార్థులకు విఐటీ అమరావతి క్యాంపస్‌లో ప్రవేశాలు కల్పించగా వారిలో సత్తెనపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ గ్రూప్‌లో 862/1000 మార్కులు సాధించిన ఉగ్గం అనీల్‌కుమార్‌కు వీఐటీ అమరావతి క్యాంపస్‌లో ఉచితంగా కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విద్యనభ్యసించే అవకాశం లభించినట్లు కళాశాల ప్రిన్సిపల్ జెడ్.ఎస్. రామచంద్రరావు తెలిపారు. మాచర్ల ఎస్‌కెబీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ గ్రూప్ 931/1000 అత్యధిక మార్కులు సాధించిన షేక్ కరీష్మాకు వీఐటీ అమరావతి క్యాంపస్‌లో ఉచితంగా విద్యనభ్యసించే అవకాశం లభించింది. శనివారం సత్తెనపల్లి కళాశాలలో అనీల్‌కుమార్‌ను, మాచర్లలో షేక్ కరీష్మాను ప్రత్యేకంగా అభినందించి ఉత్తర్వు కాపీని అందించారు. భవిష్యత్తులో మరింతగా రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆయా కళాశాలల అధ్యాపకులు, తదితరులు ఉన్నారు.

ఎస్ఈబీ అధికారులకు అదనపు బాధ్యతలు

నగరంపాలెం: గుంటూరు ఎస్ఈబీ (సెబ్)లో ప్రధానమైన రెండు పోస్టులు ఖాళీలు ఏర్పడ్డాయి. గుంటూరు, పల్నాడు జిల్లాలోని ఉన్నతాధికారులకు తాత్కాలికంగా అదనపు బాధ్యతలు అప్పగించారు. గుంటూరు సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించిన ఎస్.అన్నపూర్ణ విజయవాడకు, సహాయ సూపరింటెండెంట్ (ఏఎస్) కె.మణికంఠ నంద్యాలకు గత నెలాఖర్లో బదిలీయ్యారు. ఈ క్రమంలో గుంటూరు సూపరింటెండెంట్ బాధ్యతను పల్నాడు జిల్లా నరసరావుపేట ఎస్ఈబీ ఏఈఎస్ దుర్గ ప్రసాద్‌కు, ఏఎస్ బాధ్యతను సెబ్ స్టేషన్ గుంటూరు–1 సీఐ రమేష్‌కు అప్పగించారు.

ఒక్క ఫొటో వంద ప్రశ్నలకు సమాధానం


ఫొటోగ్రఫీ ప్రదర్శనను ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్


బెస్ట్ ఫొటోగ్రాఫర్ అవార్డు గ్రహీత కారుచోల రఘును అభినందిస్తున్న కలెక్టర్, జేసీ

- ప్రపంచ ఫొటోగ్రఫీ ఎగ్జిబిషన్ వేడుకను ప్రారంభించిన జిల్లా కలెక్టర్
- అలరించిన ఫొటోగ్రఫీ ప్రదర్శన

నరసరావుపేట: ఒక ఫొటో వంద ప్రశ్నలకు సమాధానం చెబుతుందని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. శనివారం ప్రపంచ ఫొటోగ్రఫీ సందర్భంగా స్థానిక భువనచంద్ర టౌన్‌హాలులో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ప్రారంభించారు. లూయిస్ డాగ్రే చిత్రపటానికి జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌తో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గుంటూరు జిల్లాకు చెందిన నేచర్ ఫొటోగ్రాఫర్ టి.ఎస్.వరప్రసాద్, మాస్టర్ హర్షిల్ కిరణ్ అనే 11 ఏళ్ల విద్యార్థి తీసిన ఫొటోలు, రఘు అనే ప్రముఖ ఫొటోగ్రాఫర్ తీసిన ఛాయాచిత్రాల ఎగ్జిబిషన్ తిలకించారు. ఫొటో కెమెరాను కనుగొన్న విధానం, ఫొటోలను తీసే విధానాన్ని అడిగి తెలుసుకొని, పలు కెమెరాలను, వాటి లెన్స్ వివరాలను ప్రత్యక్షంగా పరిశీలించి చూసి మంత్రముగ్ధులయ్యారు. పలు వేడుకల్లో ఫొటోగ్రఫీ పోటీల్లో పాల్గొని వచ్చిన ప్రశంసా పత్రాలను, అవార్డులను జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్‌కు చూపడంతో వాటిని చూసి వారిని అభినందించారు. కార్యక్రమంలో ఆయా శాఖల జిల్లా అధికారులు బాలూనాయక్, బీజే బెన్నీ, భాస్కర రెడ్డి, దుర్గాభాయి, వరలక్ష్మి, మస్తానమ్మ, శామ్యూల్, దీప్తి పాల్గొన్నారు.

ఆధిక్యంగా దిశగా గుంటూరు జట్టు


దేవ్‌ప్రమోద్ 132 పరుగులు

నరసరావుపేటఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కెఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న అండర్–16 బాలుర సెంట్రల్ జోన్ మూడురోజుల టెస్ట్ మ్యాచ్‌లో భాగంగా శనివారం తొలి ఇన్నింగ్స్ బ్యాటింగ్‌కు దిగిన గుంటూరు జిల్లా జట్టు రెండవ రోజు ఆట ముగిసే సమయానికి ఆరు వికెట్ల నష్టానికి 263 పరుగులు చేసింది. ప్రకాశం జిల్లా జట్టు మొదటి రోజు తన తొలి ఇన్నింగ్స్‌లో 268 పరుగులు చేసిన విషయం తెలిసిందే. ప్రకాశం జట్టుపై ఆధిపత్యానికి మరో ఆరు పరుగుల దూరంలో గుంటూరు జట్టు ఉంది. గుంటూరు జట్టు కెప్టెన్ దేవ్‌ప్రమోద్ 132 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో ఉండగా, వీపీఎస్ రెడ్డి 40 పరుగులతో కెప్టెన్‌కు అండగా ఉన్నాడు. ప్రకాశం బౌలర్లు అఖిల్‌కు రెండు వికెట్లు లభించగా, ఆకాష్, వెంకట్, గిరిష్, ఉజ్వల్‌కు తలా ఒక వికెట్ సాధించారు. మ్యాచ్‌ను ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కె.వి.పురుషోత్తమరావు, ఏసీఏ రాష్ట్ర జూనియర్ సెలక్షన్ కమిటీ చైర్మన్ సురేష్, సభ్యులు నాగార్జున, సాగర్, జిల్లా అసోసియేషన్ కార్యదర్శి డి.రమేష్‌కుమార్, గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

పోలీసుల అదుపులో నకిలీ బంగారం కేటుగాడు

గురజాల: నకిలీ బంగారం బ్యాంకులో తాకట్టు పెట్టి రుణం తీసుకునేందుకు ప్రయత్నించిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. కారంపూడి రోడ్డులోని ఒక బ్యాంక్ వద్దకు వెళ్లి యువకుడు రోల్డ్‌గోల్డుకు బంగారం కోటింగ్ చేసి 26 బంగారు గాజులను తీసుకువచ్చి ఆరు గాజులు బ్యాంక్‌లో తాకట్టు పెట్టి రూ.లక్ష రుణం తీసుకున్నాడు. మిగిలిన గాజులను మరో బ్యాంక్‌లో తనఖా పెట్టేందుకు వెళ్లాడు. యువకుడి ప్రవర్తనపై అనుమానం రావడంతో బ్యాంకు సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. పోలీసులు రంగ ప్రవేశం చేసి యువకుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. నిందితుడి వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా అనే విషయం విచారిస్తున్నట్లు సమాచారం.